www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 3 జూన్ 2025

5

ఏలూరు

5న బుట్టాయగూడెంలో ఉద్యోగ మేళా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల ఐదో తేదీ గురువారం ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని, అలాగే సుమారు 973 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నారని తెలిపారు. ఈ జాబ్ మేళకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, (డి/బి/ఎం) ఫార్మసీ, పీజీ, బి.టెక్ వంటి విద్యార్హతలు ఉండి 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు గల వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9666322032, 9652503799, 964259824, 9988853335 టోల్ ఫ్రీ నెంబర్ ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్స్ జిరాక్స్‌తో హాజరు కావాలని తెలిపారు.

కొల్లేరు ప్రజలకు న్యాయం జరిగేనా..!

- కొల్లేరు ప్రాంత ఎంఎల్ఎలు, అధికారులతో సిఎం సమీక్ష
- 20 వేల ఎకరాల జిరాయితీ, డిఫారం పట్టా భూములపై చర్చ
- మరో రెండు వారాల్లో కొల్లేరుకు రానున్న సిఇసి కమిటీ
- మూడో కాంటూరుకు కుదింపుపై మరోసారి అసెంబ్లీ తీర్మానం చేసేనా?
- కొల్లేరు కాలుష్యం, ఉప్పుటేరు ఆక్రమణలపై దృష్టి పెట్టాలని సిఎం ఆదేశం

ఎంఎల్ఎలు, అధికారులతో కొల్లేరుపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు సమస్యను త్వరితగతిన పరిష్కరించి తమకు న్యాయం చేయాలంటూ అక్కడి ప్రజలు దశాబ్దాలుగా కోరుతున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు హామీ ఇవ్వడం, గెలిచిన తర్వాత హడావుడి చేసి ఐదేళ్లు గడిచేసరికి ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం పరిపాటిగా మారుతోంది. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కొల్లేరు ప్రజలంతా ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. జిరాయతీ, డిఫారం పట్టా భూములను అప్పగించడంతోపాటు, కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, చేపల చెరువుల ధ్వంసాన్ని నిలుపుదల చేయాలని కొల్లేరు ప్రజలంతా ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామంటూ కూటమి ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా కొనసాగుతోంది. చేపల చెరువుల ధ్వంసాన్ని నిలుపుదల చేయాలంటూ కొల్లేరు రైతులు కోరుతున్నా అటవీశాఖ అధికారులు చెరువులను ధ్వంసం చేస్తూనే ఉన్నారు. చేపల చెరువులను ధ్వంసం చేయడంతో చెరువుల్లోని నీరు పంటపొలాల్లో పడి వరిరైతులు సైతం తీవ్ర నష్టాలను చూసిన పరిస్థితి సైతం రబీలో కొనసాగింది. ఇప్పటికే ఒకసారి సిఎం సమక్షంలో కొల్లేరుపై సమావేశం జరిగినప్పటికీ అధికారుల తీరులో మాత్రం మార్పులేకుండా పోయింది. కొల్లేరుపై సోమవారం సిఎం చంద్రబాబు మరోసారి కొల్లేరు ప్రాంత ఎంఎల్ఎలు చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, కామినేని శ్రీనివాస్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అటవీశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 20 వేల ఎకరాల జిరాయితీ, డిఫారం పట్టా భూములతోపాటు, కొల్లేరు కాలుష్యం, ఉప్పుటేరు ఆక్రమణలపై సిఎం చర్చించారు. మూడో కాంటూరు కుదించాలంటూ గతంలో అసెంబ్లీ తీర్మానం జరిగింది. కొల్లేరు మూడో కాంటూరుకు కుదింపుపై మరోసారి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలంటూ కొల్లేరు ప్రజల్లో చర్చ నడుస్తోంది. రెండు వారాల్లో సిఇసి (సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ) కొల్లేరులో పర్యటించనుంది. కొల్లేరు ప్రజల సమస్యలను, ప్రభుత్వ నిర్ణయాలను గట్టిగా చెప్పగలిగితేనే కొల్లేరులో ఉన్న మూడు లక్షల మంది ప్రజానీకానికి న్యాయం జరుగుతోంది.

సిఎం చర్చలో కీలక అంశాలు ఇవే..

పర్యావరణ పరంగా కీలకమైన కొల్లేరు సరస్సును పరిరక్షించుకోవాల్సిన అవసరంతోపాటు, అదే సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న ప్రజల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చ సాగింది. కొల్లేరుపై కోర్టు తీర్పులు, నిబంధనలు, కేంద్ర సంస్థల ఆదేశాలు, స్థానిక పరిస్థితులు, పర్యావరణ, కాంటూరు అంశాలపై చర్చించారు. కొల్లేరు పరిధిలో మూడు లక్షల మంది ప్రజలు ఉన్నారని, చాలా కాలంగా వీరు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చర్చలో ప్రజాప్రతినిధులు తెలిపారు. 2018లో నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు 20 వేల ఎకరాల జిరాయితీ, డీపట్టా భూములను కొల్లేరు పరిధి నుంచి మినహాయించి కొత్త సరిహద్దులను నిర్ధారించాలని చెప్పిందంటూ చర్చల్లో వచ్చింది. ఈ మేరకు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి సిఫార్సు కూడా చేసింది. అయితే దీనిపై కొందరు అభ్యంతరాలు చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరిందని, గత వైసిపి ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదంటూ చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. 'కొల్లేరు పరిధిలో 20 వేల ఎకరాల జిరాయితీ, డీపట్టా భూములు ఉన్నాయని, కాంటూరు సమస్య నేపథ్యంలో ముందుగా వీరికి న్యాయం జరిగేలా చూడాలని సమావేశంలో చర్చ సాగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సిఇసి, సుప్రీంకోర్టు ముందు ఉంచి వారిని ఒప్పించాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. అదే సమయంలో కొల్లేరు కాలుష్యంపై సమావేశంలో చర్చ జరిగింది. కొల్లేరులోకి వెళ్తున్న డ్రెయిన్ వాటర్‌కు ట్రీట్మెంట్ జరగాలని, విచ్చలవిడిగా డ్రెయిన్లు వదిలేసి కొల్లేరును కాలుష్యమయం చేసే ప్రక్రియకు బ్రేక్ వేయాలని నిర్ణయించారు. డ్రెయిన్‌లో పూడికలు తొలగించి నీరు సులువుగా వెళ్లే అవకాశం కల్పించాలన్నారు. కొల్లేరు నుంచి నీటిని సముద్రంలోకి తీసుకెళ్లే ఉప్పుటేరు ఆక్రమణలను తొలగించడంతోపాటు, ఉప్పుటేరు పూడికతీసి నీరు సముద్రంలోకి వెళ్లేలా చేయాలని నిర్ణయం జరిగింది. అవుట్ లెట్లు పూర్తిగా క్లియర్ చేయాలని, ఈ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి పనులు ప్రారంభించాలని నిర్ణయించారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

చిన్న ఆగిరిపల్లిలో హెచ్ఒ లాండ్స్‌కు సాగు పట్టాలివ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

దుక్కు దున్ని విత్తనాలు వేస్తున్న వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పేదల భూములు భూస్వాములు కట్టబెట్టే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. సోమవారం చిన్న ఆగిరిపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం, చిన్న ఆగిరిపల్లి భూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో సుమారు 40 ఎకరాల ప్రభుత్వ భూమిలో నాగలి కట్టి, దుక్కు దున్ని విత్తనాలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వి.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. అనంతరం భూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో భూ పోరాట నాయకులు అర్జున్‌రావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక పేదలకు చెందిన అసైన్డ్, సీలింగ్, 16 రకాల ప్రభుత్వ భూములను భూస్వాములకు, అదాని, అంబానీ కంపెనీలకు కట్టబెట్టే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కోస్తాంధ్ర, గోదావరి జిల్లాలు, రాయలసీమ ప్రాంతాల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూములను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నాయన్నారు. ఒకపక్క భూమిలేక పేదలు అల్లాడుతుంటే మరోపక్క కార్పొరేట్ కంపెనీలకు 99 ఏళ్లకు ప్రభుత్వ భూములను లీజుకిచ్చి వారి జీవితాలతో ఆడుకుంటున్నాయని విమర్శించారు. ఎర్రజెండా, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచిన చరిత్ర ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047లో భూ పంపిణీ లేదని తెలిపారు. ఇప్పటికే పేదలు ఈ భూముల్లో కంది, మినుము, జొన్న, పెసర తదితర పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఈ భూములపై కార్పొరేట్ కన్ను పడిందని, భూములను కాపాడుకోవడంతోపాటు భూస్వాములకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాలని తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు మాట్లాడుతూ పేదలకు చెందిన హెచ్ఒ లాండ్స్ కోసం 2007 నుంచి వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో పోరాడుతున్నట్లు తెలిపారు. నేడు ఈ భూముల్లో దుక్కి దున్ని గింజలు వేయడంతో పాటు రానున్న కాలంలో ఇక్కడ వివిధ రకాల పంటలు సాగు చేస్తామని ప్రభుత్వానికి తెలిపారు. మండల, జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు భూస్వాములు తొత్తులుగా వ్యవహరించకుండా పేదల పక్షాన ఉండాలని కోరారు. ఇప్పటికే ఆగిరిపల్లి మండలంలో రీసర్వే పేరుతో ప్రభుత్వ భూములను భూస్వాములకు కట్టబెట్టే విధంగా రెవెన్యూ యంత్రాంగం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే భూస్వాములకు తొత్తులుగా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. రానున్న కాలంలో ఈ ప్రాంతంలో భూమి కోల్పోయిన పేదలకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందని, వారి భూముల కోసం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆస్కార్ అప్పలస్వామి, జిల్లా సీనియర్ నాయకులు సత్తు కోటేశ్వరరావు, భూ పోరాట నాయకులు అర్జున్‌రావు, తాడి కుమారి, కారుకొండ శకుంతలా దేవి, జంగం మరియమ్మ, కురాటి అరుణ, జంగం వాణి, జంగం సుబ్బారావు, జంగం రంగారావు, నువ్వల బసవయ్య, బొంతు రామ్మోహనరావు, జంగం అనిల్ బాబు పాల్గొన్నారు.

పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపును నిరసిస్తూ..

ఆయిల్ పామ్ రైతుల ధర్నా

ధర్నా చేస్తున్న ఆయిల్ పామ్ రైతులు, రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పామాయిల్ దిగుమతి సుంకం 20 నుంచి 10 శాతానికి తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఎం.నాగులపల్లిలో ఆయిల్ పామ్ గెలల కాటా వద్ద ఆయిల్ పామ్ రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగులో దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందన్నారు. ముడి పామోలిన్‌పై దిగుమతి సుంకం భారీగా తగ్గించడం వల్ల ఆయిల్ పామ్ గెలల ధర భారీగా తగ్గి ఆయా రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. టన్ను ఆయిల్ పామ్ గెలల ఉత్పత్తికి రూ.22 వేలు ఖర్చవుతుందని, 2017లోనే కేంద్ర ధరల నిర్ణయాయక సంఘం (సిఎసిపి) టన్ను గెలలకు ఉత్పత్తి ఖర్చు రూ.10,035 లెక్క వేయగా ఎనిమిదేళ్లలో మరో రూ.12 వేలు పెరిగిందన్నారు. ప్రస్తుతం ధర రూ.20,290 నుంచి రూ.18,860 తగ్గిందని, ఈ ధర మరో రూ.2 వేలకుపైగా తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు మరింత నష్టాల్లో కూరుకుపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం తగ్గింపుపై పునరాలోచన చేయకుంటే ఆయిల్ పామ్ రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, మండల అధ్యక్షులు బోయపాటి సత్యనారాయణ మాట్లాడుతూ ఎం.నాగులపల్లి ఆయిల్ పామ్ గెలల కాటా వద్ద రైతులు తెచ్చిన గెలలను పచ్చి గెలల పేరుతో ఏరివేయడం దారుణమని విమర్శించారు. ఆయిల్ పామ్ గెలల ఏరివేత ఆపాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఫ్యాక్టరీ ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తూంపాటి మురళీ, ఎం.దొరబాబు, గారపాటి సత్యనారాయణ, మార్ని దుర్గారావు, ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారు.

వినతులను సత్వరమే పరిష్కరించాలి

పిజిఆర్ఎస్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులకు సూచించారు. సోమవారం చింతలపూడి తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వితో పాటు ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలకు సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అధికారులు అర్జీల పరిష్కారానికి మానవతా ధృక్పదంతో వ్యవహరించాలన్నారు. మొత్తం 312 అర్జీలు వచ్చాయని, అందులో రెవెన్యూ సంబంధించి అంశాలపై, పెన్షన్లు, రీసర్వే, అసైన్డ్ భూములు, ఇరిగేషన్, సంబంధిత అంశాలపై అర్జీలు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల్లో చింతలపూడి నియోజకవర్గంలో సుమారు 250 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.3.5 కోట్లు అందించామన్నారు.

అర్జీల్లో కొన్ని ఇలా.. ప్రగడవరం గ్రామానికి చెందిన ఎన్.చరణ్ మోహన్ రెడ్డి తనకు 60 శాతం అంగవైకల్యం ఉందని, పెన్షన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడేనికి చెందిన పి.రాజేశ్వరరావు తమ గ్రామంలో యల్లసముద్రం చెరువు ఉందని, ఆ చెరువు మట్టితో, చెట్లతోను నిండిపోయి నీరు నిల్వ చేయడానికి ఆటంకంగా ఉందని, చెరువులో పూడిక తీయాలని కోరారు. చింతలపూడి గ్రామస్తుడు బి.రమణ గ్రామంలోని ఇళ్ల కాలనీలోని రోడ్ల సమస్యను పరిష్కరించాలని కోరాడు. సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని రహదారులు, భవనాల శాఖ ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిసిఒ శ్రీనివాస్, జెడ్‌పి సిఇఒ భీమేశ్వరరావు, డిఎస్‌పి రవిచంద్ర, బిసి కార్పొరేషన్ ఈడి ఎన్.పుష్పలత పాల్గొన్నారు.

ఏలూరు : కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ ఎం.అచ్యుత్‌అంబరీష్, డిఎల్‌డిఒ ఎబిపివి.లక్ష్మి, జిల్లా కలెక్టరేట్ ఎఒ ఎన్‌వి.నాంచారయ్య, వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల సత్వర పరిష్కారానికి అధికారులు ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అదే ఫిర్యాదు మరలా పిజిఆర్ఎస్‌కు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిఆర్ఒ అధికారులకు సూచించారు. పిజిఆర్ఎస్ ద్వారా 204 అర్జీలు అందాయి. నిడమర్రు మండలం బువ్వనపల్లి గ్రామానికి చెందిన దామిశెట్టి పద్మ తన ఇంటి పట్టా పోయిందని, డూప్లికేటు ఇంటి పట్టా మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, జిల్లా కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

ఇడా ఛైర్మన్ శివప్రసాద్‌కు మంత్రి పార్థసారథి సూచన

ఘనంగా ప్రమాణస్వీకారం

బాధ్యతలు స్వీకరిస్తున్న శివప్రసాద్

మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగర అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని ఇడా ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పెద్దిబోయిన శివప్రసాద్‌కు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. స్థానిక చలసాని గార్డెన్స్‌లో సోమవారం ఇడా ఛైర్మన్ ప్రమాణస్వీకారోత్సవ సభలో మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా చలసాని గార్డెన్స్‌కు చేరుకున్నారు. అనంతరం అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు సత్యప్రసాద్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ అంకితభావంతో ప్రజలకు సేవలు చేసే వారికి పదవులు లభిస్తాయడానికి ఇడా ఛైర్మన్ శివప్రసాద్ నిదర్శనమన్నారు. ప్రజలకు శివప్రసాద్ చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం ఇడా ఛైర్మన్‌గా నియమించిందని, ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఏలూరు నగరాభివృద్ధికి కృషి చేయాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో సామాజిక న్యాయం పాటిస్తున్నామని, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, బలహీన తరగతులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ పెద్దిబోయిన శివప్రసాద్ క్రమశిక్షణ కలిగిన కార్యకర్త అని అన్నారు. పదవుల కోసం కాకుండా ప్రజల సేవ కోసం పని చేయాలన్నారు. పెద్దిబోయిన శివప్రసాద్ సమర్థతను పరిశీలించి ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా అవకాశం కల్పించామని, నగరంలో సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించి ఏలూరు నగరాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇడా ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన పెద్దిబోయిన శివప్రసాద్ మాట్లాడుతూ తనకు ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చిన ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటికి కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు నగరాభివృద్ధికి తానూ శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మాజీ మంత్రి మారడాని రంగారావు, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ, కూటమి నాయకులు పుప్పాల జగదీష్ బాబు, చోడే వెంకటరత్నం, దాసరి ఆంజనేయులు, మధ్యాహ్నపు బలరాం, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంచాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం, వ్యకాస ధర్నా

తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం, వ్యకాస నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పంగిడిగూడెంలో ఉన్న ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంపిణీ చేయాలని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద వంద మందితో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ స్లీవజోజికి వినతిపత్రం అందించారు. ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు అధ్యక్షత వహించగా సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడారు. పంగిడిగూడెంలో ల్యాండ్ సీలింగ్ ప్రభుత్వ పోరంబోకు భూములు అర్హులైన దళితులకు, భూమిలేని పేదలకు పంచాలని కోరారు. భూస్వాములను ల్యాండ్ సీలింగ్ భూముల నుంచి తొలగించి వారిపై కేసులు నమోదు చేయాలని, లేకుంటే పేదలే ఆ భూముల్లో సాగు చేస్తారని చెప్పారు. పంగిడిగూడెంలో ఉన్న వంది ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూములను పేదలకు పంపిణీ చేయాలని సుమారు 50 ఏళ్ల క్రితం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. గ్రామంలో చిన్నం రాజమన్నార్ కుటుంబీకులకు 75 సర్వే నెంబర్లలో 1130 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిలో 300 ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయాలని అప్పటి ప్రభుత్వాలు చట్టం తయారు చేయగా సుప్రీంకోర్టు తీర్పును అధికారు లు అమలు చేయకుండా తాత్సారం చేయడంతో చిన్నం రాజమన్నార్ కుటుంబీకులు ఇప్పటివరకు వెయ్యి ఎకరాలు అమ్ముకున్నారని, ఇక మిగిలింది 200 ఎకరాలు మాత్రమేనని తెలిపారు. ఈ భూములు పేదలకు పంచాలని సిపిఎం ఆధ్వర్యంలో గత 20 ఏళ్ల నుంచి పోరాటాలు చేస్తుంటే కొంత భూమి ఇచ్చి చేతులు దులుపుకున్నారని, మిగిలిన 200 ఎకరాలు పంపిణీ చేస్తామని అప్పటి రెవెన్యూ అధికారులు ఇచ్చిన హామీ అమలు చేయకపోగా పేదలపై అక్రమ కేసు లు బనాయిస్తున్నారని విమర్శించారు. మళ్లీ చిన్నం కుటుం బీకులు గ్రామ భూస్వాములతో కుమ్మక్కై అక్రమ పద్ధతిలో అమ్మకాలు, కొనుగోలు చేస్తున్నారని తక్షణమే అవి నిలుపుదల చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. పేదలకు భూములు పంచి న్యాయం చేయా లని, లేకపోతే భూమిలేని పేదలందరిని ఐక్యం చేసి భూముల్లో సాగు చేసేందుకు సిద్ధమవుతామని అధికారులను, ప్రభుత్వాన్ని హెచ్చ రిం చారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ ఈ విష యా లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పేదలకు న్యాయం చేస్తా మని చెప్పారు. మండల కమిటీ సభ్యులు జి.సూర్య కిరణ్, యాగంటి సీత, పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, మానుకొండ బాలరాజు, మంగమూరి అశోక్ కుమార్, ఎం.కుమారి, ఎ.కాంతమ్మ, డి.సత్యవతి, కె.సుబ్బారావు, బాలయ్య, యేసు, డి.సత్యవతి, డి.అమ్మాజీ పాల్గొన్నారు.

రేషన్ ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలి

సరుకులు వద్దంటే నగదు ఇస్తామనే నిర్ణయం సరికాదు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రేషన్ సరుకులు వద్దనుకుంటే నగదు ఇస్తామని సిఎం ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, అన్ని నిత్యావసర సరుకులు నేరుగా పేదల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ సరుకులు వద్దనుకంటే నగదు ఇస్తామనే సిఎం నిర్ణయం ప్రజా పంపిణీ వ్యవస్థను నీరు గార్చడానికి, ధరలు పెరగడానికి దారి తీస్తుందని తెలిపారు. డిబిటి పేరుతో పేద ప్రజల కడుపు కొట్టవద్దని పేర్కొన్నారు. రేషన్ ద్వారా తీసుకుంటున్న బియ్యం అమ్ముకుంటున్నారనే పేరుతో దొడ్డిదోవన నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. నగదు బదిలీ ప్రవేశపెట్టడమంటే ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రజల నుంచి దూరం చేయడమేనని పేర్కొన్నారు. మార్కెట్‌లో బియ్యం ధరలు పెరిగినా ప్రభుత్వం ఇచ్చే నగదు మాత్రం పెరగదని, అంతిమంగా పేద ప్రజలు నష్టపోతారని తెలిపారు. అక్రమ రవాణా అరికట్టాలన్నా, రేషన్ బియ్యం బయటకు పోకూడదనుకున్నా నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేయడమే పరిష్కారమని తెలిపారు. పేద ప్రజలకు ఇచ్చే నగదుతో బయట మార్కెట్‌లో వచ్చే సరుకులు పరిమితంగా ఉంటాయని, అందుకే రేషన్ సరుకుల బదులు నగదు ఇచ్చే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. పేదలకు ఇచ్చే రేషన్ సరుకులు నేరుగా పేదల ఇళ్ల వద్దకే చేరే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.

సిపిఎం జిల్లా శాఖా కార్యదర్శుల విస్తృత సమావేశం

సిపిఎం జిల్లా శాఖాకార్యదర్శుల విస్తృత సమావేశం ఈ నెల మూడో తేదీ బుధవారం జంగారెడ్డిగూడెంలోని రోటరీ క్లబ్ హాలులో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిపిఎం రాష్ట్ర నాయకులు వి.ఉమామహేశ్వరరావు, బి.బలరాం హాజరయ్యే ఈ సమావేశానికి జిల్లాలోని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తలు హాజరు కావాలని తెలిపారు. ఈ సమావేశంలో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ప్రజల తరపున ఏ విధంగా పోరాడాలి, ప్రజలపై ఆస్తి పన్ను పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపు వంటి భారాలపై ప్రజలను చైతన్యం చేసి ప్రభుత్వంపై ఏ విధంగా ఒత్తిడి తేవాలనే అంశాలను చర్చించి నాయకులకు, కార్యకర్తలకు ఈ సమావేశంలో దిశనిర్దేశం చేస్తామని తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలు అడ్డగింత

ప్రశ్నించిన సిపిఎం నేతపై దాడి

ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజల వేడుకోలు

మట్టి తవ్వే ప్రదేశంలో జెసిబి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని రెడ్డి గణపవరం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా చట్ట వ్యతిరేకంగా జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను గ్రామ యువకులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్న స్పందించని అధికారుల తీరుపై సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మంగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకులు అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని ప్రశ్నించిన సిపిఎం నేతపై భౌతిక దాడికి, దౌర్జన్యానికి పాల్పడ్డారు. అడ్డూ అదుపు లేకుండా నెల రోజులుగా గ్రామంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతూ అధికారులను మేనేజ్ చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మంగరాజు తెలిపారు. ఇటుక బట్టీలకు మట్టి వ్యాపారం చేస్తున్నవారిని నిలుపుదల చేయాలని పదేపదే అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా మీకేం సంబంధం మీకు అభ్యంతరాలెందుకు అంటూ అధికారులు వత్తాసు పలకడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. తవ్వకాలను అడ్డుకుని మట్టి తవ్వే ప్రదేశంలో గ్రామస్తులు, యువకులు సుమారు మూడు గంటలకు పైగా ఉన్నప్పటికీ అధికారులు ఎవరూ రాకుండా గుట్టుచప్పుడు కాకుండా పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వీరిపై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోవాలని, షెడ్యూల్ ప్రాంతంలో గిరిజన చట్టాలను తుంగలో తొక్కి నిర్వహిస్తున్న మట్టి అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని, చట్ట విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి సహకరిస్తున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని పి.మంగరాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ గిరిజన యువత జి.పవన్‌కళ్యాణ్, కె.రవి, కె.రామచంద్రం, డి.రాజ్‌కుమార్, సిపిఎం గ్రామ నాయకులు కె.జలపాలు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అందించాలి

రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా


వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమడోలు

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని కోరుతూ ఎపి రైతు, కౌలు రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో భీమడోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. మోకాళ్లపై నిలబడి తమ నిరసన తెలిపారు. అనంతరం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రదేశానికి వెళ్లి అక్కడ ఉన్న భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి, ఎఒ ఉషారాణికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెజ్జు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతుల సంక్షేమ చట్టాన్ని తెచ్చి అమలు చేయాలని కోరారు. వాస్తవ సాగుదారులకు సైతం పెట్టుబడి సహాయం నగదులో అందక వారు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కటా భాస్కరరావు, సీనియర్ నాయకులు జి.ప్రసాదరావు, జిల్లా సమన్వయకర్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యంపై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చింతలపూడి ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ జి.ధాత్రిరెడ్డి, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొని సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధిత జాబితా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దన్నారు. కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మ ధర పతనం.. రైతుకు నష్టం..!

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెంలో నిమ్మ రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారు. సాధారణంగా వేసవిలో నిమ్మకు డిమాండ్ ఎక్కువగా ఉండి ధరలు పెరుగుతాయి. ఈ ఏడాది మే నెలలో నిమ్మ ధర కిలోకు రూ.వంద వరకు చేరింది. ఈ స్థిరమైన అధిక ధరలను చూసి అనేక రైతులు నిమ్మ సాగులో పెట్టుబడులు పెట్టారు. అయితే అకస్మాత్తుగా వచ్చిన వర్షాలు, తక్కువ ఉష్ణోగ్రతలు వినియోగదారుల డిమాండ్‌ను గణనీయంగా తగ్గించాయి. జూన్ ఒకటో తేదీ నాటికి నిమ్మ ధర కిలోకు రూ.20కి పడిపోయింది. నిమ్మకాయలు కోస్తే కూలీల ఖర్చులు, ఆటో కిరాయిలు కూడా వచ్చే పరిస్థితి కూడా లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి న్యాయమైన ధరలు, మధ్యవర్తులపై పర్యవేక్షణ, నేరుగా ఎగుమతి అవకాశాలను కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

పకృతి వ్యవసాయం ద్వారా పండించిన పండ్లను తింటే ఆరోగ్యకరంగా ఉంటారని ప్రకృతి వ్యవసాయ మండల క్లస్టర్ ఆర్గనైజర్ పద్మ, మాస్టర్ ట్రైనర్ కాంతమ్మ తెలిపారు. మండల కేంద్రమైన తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన కూరగాయలను, పండ్లను అమ్మకం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు రసాయనిక, క్రిమి సంహారక మందులు ఎక్కువగా వాడితే అనారోగ్యానికి గురవుతారని, అంతేకాకుండా అధిక పెట్టుబడి ఎక్కువ అవుతుందని, అందువల్ల పకృతి వ్యవసాయ పంటలు పండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎంఎంటి శారమ్మ, యూనిట్ ఇన్‌ఛార్జి కర్ర నాగమణి, పకృతి సిబ్బంది శివ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి - దెందులూరు

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమం వట్లూరులో ప్రారంభమైంది. జూన్ రెండో తేదీ నుంచి నాలుగో తేదీ వరకు మూడు రోజులు జరిగే శిక్షణా కార్యక్రమానికి జోన్-2లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రిన్సిపల్స్ హాజరయ్యారు. విద్యా వ్యవస్థలోని నూతన విధానాలు, సంస్థాగత ప్రణాళికల గురించి ఈ శిక్షణ కార్యక్రమంలో చర్చించనున్నట్లు వట్లూరు కళాశాల ప్రిన్సిపల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి అన్నారు. ఈ కార్యక్రమంలో అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీ నుంచి ప్రవీణ్ నాయుడు, తిరంగ్, కళాశాల ప్రిన్సిపల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల పెంపును నిలిపివేయాలని వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో ఇంటి పన్నుల పెంపుదల నిలిపివేయాలని కోరుతూ సిపిఎం పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు ఆర్‌డిఒకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ పట్టణంలో ఇంటి పన్నులు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు పెంచడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కె.మాబుసుభాని, గోపీ పాల్గొన్నారు

నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

నాగిరెడ్డిగూడెం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, గ్రామంలో నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడెంలో సోమవారం నిర్వహించిన నవోదయం 2.0 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ కట్టడి చేసుకోగలిగితే రాష్ట్రంలో ఒక ఆదర్శవంతమైన గిరిజన గ్రామంగా అన్ని రంగంలో అభివృద్ధి చేస్తానన్నారు. నాటు సారా తయారీ మానేస్తే వారి పైన ఉన్న కేసులు కొట్టివేయనున్నట్లు తెలిపారు. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. నవోదయం 2.0 ప్రతిజ్ఞ చేయించారు. మహిళలు వారి బాధలను ఎంఎల్ఎకు వివరించారు. ఖాళీ డ్రమ్ములు పట్టుకుంటే పాత కేసులు ఉన్న వారిపై అన్యాయంగా కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఏలూరు అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.ప్రభుకుమార్, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏలూరు సిఐ ఫణికుమార్, చింతలపూడి సిఐ పి.అశోక్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - దెందులూరు

జల జీవన్ మిషన్ ద్వారా దెందులూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజల తాగునీటి సమస్యలు తీర్చడానికి చర్యలు చేపట్టామని, ఈ నేపథ్యంలోనే దెందులూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఓవర్ హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేపట్టామని, త్వరితగతిన ఒహెచ్‌ఎస్‌ఆర్‌ల నిర్మాణం కూడా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పలువురు అధికారులు, కూటమి నాయకులు, ప్రజలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి పలు ఆహ్వాన పత్రికలు అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతుల స్వీకరించిన ఎంఎల్ఎ సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

'సూపర్ సిక్స్' అమలు కోరుతూ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్ శేషారావుకు వినతిపత్రం అందించారు.

కొయ్యలగూడెం : పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, ఇల్లు కట్టుకోవడానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ధర్నా చేశారు. తహశీల్దార్ చెల్లన్నదొరకు వినతిపత్రం అందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అత్యుత్తమ నాణ్యమైన విద్య నవమి గ్లోబల్ సొంతం

స్కూల్ ప్రిన్సిపల్ మద్దిరాల రవి

ప్రిన్సిపల్ మద్దిరాల రవి

నవమి గ్లోబల్ స్కూల్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి ఐఐటి, నీట్, సిఎ, యుపిఎస్‌సి అత్యుత్తమ విద్యను అందించే లక్ష్యంతో నవమి గ్లోబల్ స్కూల్ ప్రణాళిక బద్ధంగా ముందడుగులు వేస్తుందని ఆ స్కూల్ ప్రిన్సిపల్ మద్దిరాల రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. 25 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘమైన అనుభవంతో ఏర్పాటు చేసిన నవమి గ్లోబల్ స్కూల్ పట్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల్లో గొప్ప ఆసక్తి నెలకొందని వివరించారు. నూజివీడు పట్టణ పరిసర ప్రాంతాలకు తాను సుపరిచితుడినని, అనుభవం కలిగిన అత్యుత్తమ ఉపాధ్యాయులు అని గ్లోబల్ స్కూల్‌కు తమ చిన్నారులను తల్లిదండ్రులు తీసుకొస్తున్నారన్నారు. గ్లోబల్ స్కూల్‌లో 300 మంది విద్యార్థులు, 25 మంది ఉపాధ్యాయులు, సిబ్బందితో ముందుకు తీసుకెళ్లే లక్ష్యంగా ప్రణాళికలు రచించినట్లు వివరించారు. విద్య అంటే బట్టీ విధానం కాదని, పాఠ్యాంశాల అధ్యయనం, సమాజ అవలోకనం, సమాజ హితం, పెద్దల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల ఆదరణ, గురువుల పట్ల మర్యాద కలిగి ఉండడం అని వివరించారు. ఇప్పటివరకు తన విద్యాబోధనలో ఎందరో విద్యార్థులు ఐఐటీలుగా, డాక్టర్లుగా, బ్యాంకు మేనేజర్లుగా, మరెన్నో వివిధ శాఖల్లో స్థిరపడి అత్యున్నతమైన జీవితాన్ని గడుపుతున్నట్లు సోదాహరణంగా వివరించారు. ప్రస్తుతం తాను, తన మిత్రులు, సహ ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన నవమి గ్లోబల్ స్కూల్ ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ నాణ్యమైన విద్యను అందించనున్నట్లు తెలిపారు. డిజిటల్ క్లాస్ రూమ్స్, స్పెషల్ కంప్యూటర్ ట్రైనింగ్, ఆక్టివిటీ బేస్డ్ టీచింగ్, ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకున్నట్లు చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ క్లాసెస్ నిర్వహిస్తామన్నారు. అందరు విద్యార్థులకు అబకాస్, వేదిక్ మ్యాథమెటిక్స్, ఆర్ట్స్, స్పోర్ట్స్, డ్యాన్స్ వంటి అనేక అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో స్నేహపూర్వక వాతావరణం తమ ప్రత్యేకతగా పేర్కొన్నారు. విద్యార్థుల దినసరి కార్యక్రమాలు, చదువు పట్ల వారికి ఉన్న శ్రద్ధపై తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు అన్ని వివరాలు తెలియజేయనున్నట్లు చెప్పారు. ప్రీ ప్రైమరీ, ప్లే స్కూల్ విధానంలో యుకె కాన్సెప్ట్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్ చైన్‌గా లండన్ కిడ్స్‌తో అనుసంధానం వల్ల ప్రత్యేకమైన శిక్షణతో నిత్య నూతనమైన విద్యావిధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. నవమి గ్లోబల్ స్కూల్ తరఫున తామంతా ఒకే విషయాన్ని గట్టిగా చెప్పగలమని, అదే అత్యుత్తమ విద్య చిన్నారులకు అందిస్తామని చెప్పారు. ఇది ప్రతి విద్యార్థి, తల్లిదండ్రులకు అర్థం చేసుకొని తమ పాఠశాల వైపు అడుగులు వేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. విద్యను వ్యాపారంగా కాకుండా సామాజిక అంశంగా తీసుకుని నేటి పోటీ ప్రపంచంలో అత్యాధునిక విధానంలో విద్యను అందించేందుకు చిన్నారి విద్యార్థుల కోసం నవమి గ్లోబల్ స్కూల్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కువైట్ కేసులు ఒక్కొక్కటిగా పెరుగుతూ ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక పోలీస్ గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఫిర్యాదుదారుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. గత రెండు వారాలుగా ఫిర్యాదులను నేరుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సేకరిస్తున్నారు. 58 ఫిర్యాదులు ఎస్‌పికి అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కోవిడ్ విస్తరిస్తున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫిర్యాదుదారులకు వారి సహాయకులకు ఉచిత భోజన సౌకర్యాన్ని నగరంలోని సత్యసాయి సేవా ట్రస్ట్ ద్వారా కల్పించామన్నారు.

'మీకోసం'కు 13 అర్జీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉదయ్‌భాస్కర్‌కు అందించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. జటిలమైన సమస్యలు పరిష్కారం కాకుంటే వాటి వివరాలను అర్జీదారులకు వివరిస్తామన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు మొత్తం 13 రకాలైన సమస్యలను అర్జీల రూపంలో అందించినట్లు తెలిపారు.

చనుబండ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చాట్రాయి

30వ జాతీయస్థాయి కరాటే పోటీలు-2025 ఖమ్మం జిల్లా ఖమ్మంలో సుమన్ షోటో ఖాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం వర్తక సంఘం భవనంలో నిర్వహించారు. ఈ కరాటే పోటీల్లో మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన రేవంత్ డిఫెన్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఆ సంస్థ ఫౌండర్ కోచ్ మరకాల రేవంత్ తెలిపారు. కరాటే విభాగంలో చనుబండ గ్రామానికి చెందిన ప్రథమ స్థానం, రెబ్బ గంగావైష్ణవి, ద్వితీయ స్థానం, మోరంపూడి వల్లిక, రెబ్బ ఉమా సాయి వీక్షిత్ కైవసం చేసుకున్నారన్నారు. గెలుపొందిన విద్యార్థులను ఎపి మార్షల్‌ఆర్ట్స్ చీఫ్ కోచ్ రేవంత్ అభినందించారు.

చెట్లు నరికి కలప రవాణా

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం - ఉండి ఆర్‌అండ్‌బి రోడ్డు వెంబడి నారాయణపురం- సీతారాంపురం దారిలో రోడ్డు పక్కన ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను నరికి కలప తరలిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఆర్‌అండ్‌బి, విద్యుత్ శాఖల మధ్య సమన్వయం లేని కారణంగానే అస్సలు చెట్లు కొట్టడానికి అనుమతి ఉందో..లేదో తెలియడం లేదు. ఇటీవల కొత్తగా విద్యుత్ లైన్ నిర్మాణాల కోసం చెట్ల కొమ్మలను మాత్రమే తొలగించేందుకు ఆర్‌అండ్‌బి శాఖ అనుమతులు ఇచ్చిందని పూర్తిగా చెట్లను తొలగించమని కాదని ఎఇ పి.భాస్కరరావు చెప్పారు. పచ్చని చెట్లను తొలగించడం పట్ల పర్యావరణ కార్యకర్తలు విమర్శిస్తున్నారు.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - నిడమర్రు

ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రమేయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కోన శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు నిడమర్రు తహశీల్దార్ కార్యాలయంలో డిటికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు రైతులకు భూమి యజమాని సంతకం ప్రమేయం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. నష్టపోయిన కౌలు రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ నష్టపోయిన ఆక్వా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం సభ్యులు వెలగలేటి మోహన, లావేటి సోంబాబు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కిరిపాటి ఆనంద్ కోరారు. ఈ మేరకు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టి సబ్ కలెక్టర్ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉదయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ఎనిమిది వారాలుగా ఉపాధి హామీ కూలీలకు వేతనాలు ఇవ్వకపోవడంతో పేద కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని, లేకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, సిపిఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహా, మడుపల్లి నాగేంద్రరావు, రైతుసంఘం నాయకులు బొప్పుడి రాంబాబు, ఆకునూరి విఘ్నేష్, నాయుడు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలోనే హంసపాదు..!

రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షణ

మొరాయిస్తున్న సర్వర్

ఉంగుటూరు : రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రేషన్ దుకాణంలో నిత్యావసరాలు తీసుకునేందుకు లబ్ధిదారులు గంటల తరబడి క్యూలో ఉండాల్సి వస్తుంది. ఉదయం పూట సర్వర్ బాగానే ఉంటున్నా మధ్యాహ్నం సరిగ్గా పనిచేయట్లేదు. అసలే వడగాల్పులు, ఉక్కపోత ఎండలకు జనాలు ఇబ్బంది పడుతున్నారు. బియ్యం, పంచదార కోసం సాయంత్రం నాలుగు గంటలకు వచ్చానని, సర్వర్ పనిచేయక రెండున్నర గంటలకుపైగా వేచి ఉన్నానని వడగాల్పులకు మైకం కమ్మినట్టు నారాయణ పురానికి చెందిన మహిళ వాపోయింది. పాత విధానమే బాగుందని కొత్త విధానంతో చాలా ఇబ్బంది పడుతున్నామని పలువురు వాపోయారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి సర్వర్ ఇబ్బందులు ఉన్నట్లు డీలర్లు తెలిపారు.

రేషన్ కోసం ప్రజలు అవస్థలు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల ప్రజలు రేషన్ సరుకుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో ఇళ్ల మధ్యకు వచ్చి రేషన్ ఇచ్చేవారని, అప్పుడే బాగుందని ప్రజలు అంటున్నారు. ఇప్పుడు డీలర్ షాపునకు వెళ్లి నాలుగు గంటల సమయం అక్కడ నిలబడి సమయం వృథా చేసుకోవాలని ప్రజలు అంటున్నారు. ఒక కుటుంబంలో 20 కేజీల రేషన్ బియ్యాన్ని మహిళలు తీసుకురాలేరుగా అంటున్నారు. ప్రభుత్వం ఒక సారి ఆలోచించి ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టిని తవ్వేస్తున్న అక్రమార్కులు

అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు

ఉంగుటూరు : తిమ్మయ్యపాలెంలో గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం రెండు వేర్వేరు చోట్ల సేకరించిన భూమిలో ఉపాధి హామీ నిధులతో 2021లోనే మెరక చేశారు. అందులో 82 మందికి పట్టాలు కూడా ఇచ్చేశారు. ఆ తరువాత కోర్టు కేసు కారణంగా అప్పటినుంచి ఆభూమి నిరుపయోగంగా ఉంది. ఈ క్రమంలో కోర్టు కేసులో ఉన్న మెరక మట్టిని యంత్రాల సాయంతో ఆదివారం రాత్రి తవ్వేస్తున్నారని పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అక్రమ తవ్వకాలపై రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా సరైన స్పందన లేదని ఆరోపిస్తున్నారు. దాదాపు రూ.ఐదు లక్షల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో పూడ్చిన స్థలంలో మట్టిని తవ్వేస్తున్నా సంబంధిత శాఖలు మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు అంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి సంఘటనా స్థలానికి వెళ్లానని, అక్కడ ఎలాంటి తవ్వకాలు కనిపించలేదని విఆర్ఒ దుర్గాప్రసాద్ చెబుతున్నారు. కాగా స్థానికులు తవ్వకాలను వీడియో తీసి మీడియాకు పంపారు. వాటిలో వాహనాల నెంబర్ల ఆధారంగా రిపోర్టు రాసి ఇవ్వాల్సిందిగా విఆర్ఒకు చెప్పామని, అనంతరం చర్యలు తీసుకుంటామని ఆర్ఐ దావీదు రాజు వెల్లడించారు. విఆర్ఒ, ఆర్ఐ ఇన్‌స్పెక్షన్ చేశారు. వారిచ్చే నివేదికపై తగు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ పాలపర్తి రవికుమార్ వెల్లడించారు. లేఅవుట్‌ను హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు ఇంకా అప్పగించలేదని రెవెన్యూ శాఖ ఆధీనంలో ఉందని ఎఇ సతీష్ వెల్లడించారు.

వినోదాత్మకంగా వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు 30వ రోజు సోమవారం ఎంతో వినోదాత్మకంగా జరిగాయి. ముందుగా గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులతో వజ్రాలనిధి-నలుగురు మిత్రులు తెలివైన కుందేలు నీతి కథలను బోధించి అందులో నీతిని వివరించారు. రిసోర్స్ పర్సన్ ఐ.శ్రీనివాసరావు మాట్లాడారు. ఆత్మవిశ్వాసంతో అన్ని సాధ్యపడుతాయని చిన్నారులకు గొప్ప సందేశాన్ని అందించారు. అనంతరం విద్యార్థులకు స్వర్ణాంధ్ర - 2047 అనే అంశంపై వ్యాసరచన పోటీలను రిసోర్స్‌పర్సన్ జివి.ఆనందరావు నిర్వహించారు.

టి.నరసాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులకు కథలు, కథనాలు, సృజనాత్మకత కృత్యాలతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరచుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు.

హెచ్‌ఎంకు పూర్వ విద్యార్థుల సత్కారం

ఉంగుటూరు : ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన పాఠశాలకే హెచ్‌ఎంగా వచ్చిన తోట పోతురాజును ఆనాటి సహచర క్లాస్‌మేట్లు అభినందించారు. నారాయణపురం వివేకనంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984 - 1989 వరకు చదివిన పూర్వ విద్యార్థుల్లో పోతురాజు ఒకరు. ఉపాధ్యాయుల బదిలీల్లో నారాయణపురం స్కూల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆనాటి సహచర మిత్రులు కుంచనపల్లి పంచాయతీ గ్రేడ్ - 1 పంచాయతీ కార్యదర్శి రావిపాటి వీరబ్రహ్మం, వల్లూరి హనుమంతరావు, కత్తుల కిషోర్, కానిస్టేబుల్ రాంబాబు, పివి.సత్యనారాయణ తదితరులు పోతురాజును మంగళవారం సత్కరించారు. ఒకప్పుడు చదివిన పాఠశాలకే హెచ్‌ఎంగా రావడం పట్ల మిత్రులు సంతోషం వ్యక్తం చేశారు. 1988-89 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఇదే పాఠశాలలో త్వరలో నిర్వహించి ఈ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

ఎంపిపి పాఠశాల హెచ్‌ఎంగా గంగరాజు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం బాలాజీ నగర్ ఎంపిపి పాఠశాల అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని నూతన ప్రధానోపాధ్యాయులు కళ్లెం గంగరాజు తెలిపారు. బాలాజీనగర్ ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు గంగరాజు మాస్టారుకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. అలాగే శాలువాతో సత్కరించారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకరరావు మాట్లాడుతూ పేదల ప్రాంతంలో ఎంతోమందికి విద్యను అందిస్తున్న బాలాజీ నగర్ ఎంపిపి పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా అభివృద్ధి పరచడానికి అందరూ సహకరించాలని కోరారు. పేద విద్యార్థుల అనేకమంది తమ చదువును కొనసాగించడానికి బైపాస్ రోడ్డును దాటుకుని వెళ్లాల్సి వస్తుందన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు దృష్టి సారించి బాలాజీ నగర్ ఎంపిపి పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అనంతరం గంగరాజు మాస్టర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా, అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణరావు పఠాన్ బాజీ, ఉపాధ్యక్షులు ఎల్.శ్రీనివాస్, పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ మంగయ్య, ఉపాధ్యాయ సిబ్బంది, టిడిపి నాయకులు, మద్దిపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు శిక్షణ

ప్రజాశక్తి - భీమడోలు

మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు సంబంధిత ఏజెన్సీలు కృషి చేయాలని, ఈ మేరకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎంఇఒలు శ్రీనివాసరావు, భాస్కర కుమార్ తెలిపారు. భీమడోలు హైస్కూల్ వేదికగా మంగళవారం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.పద్మజ అధ్యక్షత వహించారు. అవగాహన కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు భారతి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు భోజన పథకం నిర్వహణ, పదార్థాల తయారీ, పౌష్టికాహార తోట నిర్వహణ, ఆహార పదార్థాల నిల్వ ఇతర అంశాల గురించి వివరించారు. అనంతరం నిర్వాహకులు మధ్యాహ్న భోజన పథకంలో అందించే పదార్థాల ప్రదర్శనశాలను సందర్శిం చారు. పదార్థాలను రుచి చూశారు. మరింత సమర్థవం తంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు సత్యప్రసాద్, రమణ పాల్గొన్నారు.

ముసునూరు : విద్యార్థులకు వంట ఏజెన్సీ ద్వారా వండే పదార్థాలు రుచిగా, సుచిగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని 16 గ్రామాల పాఠశాలల వంట ఏజెన్సీలో వంట చేసే వారికి సహాయం చేసే మహిళలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వీరికి రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన చిన్నంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ కుకింగ్ ఏజెన్సీ వారు రమణ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో మండల స్థాయిలో 36 మంది వంట వారు పాల్గొన్నారు.

కళాశాలలో జాబ్ మేళా

ఏలూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. దివిస్ లేబరేటరీ సంస్థలో ఉద్యోగాల కోసం నిర్వహించిన ఈ జాబ్ మేళాకు మొత్తం 35 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. పరీక్ష, ఇంటర్వ్యూలను సంస్థ ప్రతినిధి రాజేష్, కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ కె.రమేష్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెకెసి కో-ఆర్డినేటర్ టివిఎస్.పద్మావతి సమన్వయకర్తగా వ్యవహరించారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పోడూరు మండలం, పెనుమదం గ్రామానికి చెందిన నక్క జ్యోతి, భర్త: చక్రవర్తి, డోర్ నెం. 6-57, నకు చెందిన **U6948583** నెంబర్ గల పాస్పోర్ట్ పోయినది. పెనుమదం నుంచి వీసా నిమిత్తం మోటర్ సైకిల్‌పై వెళుతుండగా పాస్పోర్ట్ కలిగిన కవరు మార్గమధ్యంలో పడిపోయింది. ఆ కవర్లో విశాఖపట్నం వారి జారీచేసిన **U6948583** ఒరిజినల్ పాస్పోర్టు కలిగి ఉంది. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు సంప్రదించగలరు.

నక్క జ్యోతి
భర్త: చక్రవర్తి
డోర్ నెం. 6-57, పశువుల ఆసుపత్రి వీధి,
పెనుమదం, పోడూరు మండలం,
ప॥గో॥జిల్లా - 534 267
సెల్ నెం: 72075 59243

పాస్‌పోర్ట్ పోయినది

మారపట్ల జ్యోతిర్మాయి, భర్త, ఏసుదాసు, డోర్ నెంబర్ 5-92, ఎస్సీ కాలనీ, స్కూల్ వద్ద, ఉప్పులూరు, ఉండి మండలం, ప.గో.జిల్లా,ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి 21-09-2010 న **J2326000** నెంబర్, పాస్ పోర్ట్ తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్ పోర్ట్ ను తీసికొని ది 20-05-2025 న ఉండి నుంచి లంకల కోడేరు బస్ లో వచ్చి ఆటో లో పాస్ పోర్ట్ రెన్యూవల్ గురించి ఏజెంట్ వద్దకు రాగా నా ఒరిజినల్ పాస్ పోర్ట్ దారిలో పడిపోయింది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ దొరకలేదు.కాబట్టి ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్ కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

నా సెల్ నెంబర్: 95154 21283

ప్రకటన

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి ఏలూరు వారి కోర్టులో

A.R.B.E.P. 169/2025
IN A.C.P. 758/2021

బిట్వీన్
M/S. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
Rep. by its Authorized Signatory
..డి. హెచ్. ఆర్/క్లయింట్
AND
వేమరెడ్డి సత్యనారాయణ 2 అదర్స్
...జె.డి.ఆర్/రెస్పాండెంట్స్

పై నంబరు గ్రంథములో జె.డి.ఆర్స్/రెస్పాండెంట్స్, జె.డి.ఆర్ 3 అయిన వేమరెడ్డి సత్యనారాయణ S/o. సోమేశ్వర, D.no. 2-72, సంతమార్కెట్, ద్వారకా తిరుమల అనువారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట ది. **17-06-2025వ సం.రం తేది ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపకోగలరు. లేని యెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
N.V. సత్యనారాయణ
Ch. సౌందర్య
ఏలూరు
ది.02-06-2025
అడ్వకేట్స్, ఏలూరు

ప్రకటన

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి ఏలూరు వారి కోర్టులో

A.R.B.E.P. 168/2025
IN A.C.P. 170/2023

బిట్వీన్
M/S. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
Rep. by its Authorized Signatory
..డి. హెచ్. ఆర్/క్లయింట్
AND
కొలిశెట్టి జయ కిషోర్ 2 అదర్స్
...జె.డి.ఆర్/రెస్పాండెంట్స్

పై నంబరు గ్రంథములో జె.డి.ఆర్ 3వ పెద్దిరెడ్డి బాలకృష్ణ S/o. సూర్యచంద్రరావు, D.no. 17-73, ఎమ్.ఎమ్ పురం, పూళ్ళ, భీమడోలు అనువారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 20-06-2025వ సం.రం తేది ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపకోగలరు. లేని యెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
N.V. సత్యనారాయణ
Ch. సౌందర్య
ఏలూరు
ది.02-06-2025
అడ్వకేట్స్, ఏలూరు

ప్రకటన

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి ఏలూరు వారి కోర్టులో

A.R.B.E.P. 170/2025
IN A.C.P. 73/2023

బిట్వీన్
M/S. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
Rep. by its Authorized Signatory
..డి. హెచ్. ఆర్/క్లయింట్
AND
బట్‌రాజ్ నాగబాబు 2 అదర్స్
...జె.డి.ఆర్/రెస్పాండెంట్స్

పై నంబరు గ్రంథములో జె.డి.ఆర్ 3 బట్‌రాజ్ రవీంద్ర, S/o. భాస్కరరావు, D.no. 9-40, గుండుగొలను, భీమడోలు మండలం అనువారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 18-06-2025వ సం.రం తేది ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపకోగలరు. లేని యెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
N.V. సత్యనారాయణ
Ch. సౌందర్య
ఏలూరు
ది.02-06-2025
అడ్వకేట్స్, ఏలూరు